ప్రజారోగ్యానికి పెద్దపీట

ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో వైద్య శిబిరాలను సోమవారం నిర్వహించగా.. వైద్యులు రోగులకు మెరుగైన సేవలందించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్ ఆకట్టుకున్నాయి.


నందిగాం: శివరాంపురంలో నేత్ర పరీక్షలు పరిశీలిస్తున్న కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి


కోటబొమ్మాళి: మహసాహెబ్‌పేటలో మందుల కిట్ అందజేస్తున్న టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి, కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్


సోంపేట: గొల్లగండిలో రోగితో మాట్లాడుతున్న ఎంపీపీ నిమ్మన దాస్


కవిటి: జగతిలో గర్భిణికి పోషణ కిట్ అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు


నందిగాం: శివరాంపురంలో వోపీ వివరాలు తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి


వజ్రపుకొత్తూరు: రెయ్యిపాడులో మందులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, తదితరులు

క్లుప్తంగా

పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షునిగా రామచంద్రరావు


నూతన కార్యవర్గ సభ్యులు

టెక్కలి: జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షునిగా టెక్కలికి చెందిన రోణంకి రామచంద్రరావును ఎన్నుకున్నారు. ఈ మేరకు కొత్తగా ఏర్పాటైన జిల్లా సంఘానికి సంబంధించి బేరర్లను కూడా ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా కె.మోహన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా బి.జయపతి, జనరల్ సెక్రటరీగా ఎ.ధర్మారావు, కోశాధికారిగా బి.మోహన్‌రావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎం.ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.శాంతారావు తో పాటు 8 మందితో సంఘాన్ని ఎన్నుకున్నారు. టెక్కలి, కోటబొమ్మాళి, ఇచ్ఛాపురం, పలాస, కవిటి, సోంపేట, నరసన్నపేట, పొందూరు, రణస్థలం తదితర మండలాలకు చెందిన పెన్షనర్లతో సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు రామచంద్రరావు తెలిపారు.

మృతుల కుటుంబాలకు మంత్రి పరామర్శ


పారమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి అప్పలరాజు

మందస: బహడపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సాలీన పారమ్మ, నల్లబొడ్లూరు గ్రామానికి చెందిన కుత్తుము రామయ్య ఇటీవల మరణించారు. వీరి కుటుంబాలను మంత్రి సీదిరి అప్పలరాజు సోమవారం పరామర్శించారు. పారమ్మ కుటుంబసభ్యులైన వైఎస్సార్‌సీపీ నాయకులు జోగారావు, నారాయణరావు, రాజు, ఈశ్వరరావు, లక్ష్మి, సరస్వతి, సర్పంచ్ గుసిరి వెంకటరావు, సార దూర్వాసులను ఓదార్చారు. మంత్రి వెంట ఎంపీపీ డొక్కరి దానయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మామిడి కృష్ణారావు, నాయకులు బొడ్డు ఉమాపతి, తులసయ్య, జోగారావు, మట్ట కూర్మారావు, వంకల మాకయ్య ఉన్నారు.

భవనం పనుల పరిశీలన

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి పంచాయతీ బుడ్డేపుపేట దళిత వాడలో జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ పనులను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పిట్ట మామయ్య సోమవారం పరిశీలించారు. డిసెంబర్ మాసాంతానికి పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

కంప్యూటర్ అందజేత


కంప్యూటర్ అందజేస్తున్న నాగేశ్వరరావు

ఇచ్ఛాపురం రూరల్: కొళిగాం ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి బొబ్బిలి నాగేశ్వరరావు ఔదార్యాన్ని చాటుకున్నారు. రూ. 18 వేల విలువైన కంప్యూటర్‌ను పాఠశాలకు సోమవారం బహూకరించారు. బడి రుణం తీర్చుకుందాం కార్యక్రమంలో భాగంగా కంప్యూటర్‌ను సమకూర్చారు. ఈయన ప్రస్తుతం తేలుకుంచి ప్రాథమికోన్నత పాఠశాలలో హిందీ భాషోపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయులు వాసుదేవరావు, హిందీ గ్రేడ్-1 ఉపాధ్యాయులు నరేంద్రనాథ్ పట్నాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేయండి


బస్సు యాత్ర ప్రచారంలో నాయకులు

కాశీబుగ్గ: రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో పలాసలో వచ్చేనెల మూడో తేదీన జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్ అన్నారు. 16వవార్డు శ్రీనివాసనగర్‌లో సోమవారం యాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి ఇంటింటికి వెళ్లి పంచిపెట్టారు. ఆయనతో పాటు వార్డు ఇన్‌చార్జి మార్పు యుగంధర్, సన్యాసి అప్పో పాల్గొన్నారు.

హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ


గిరీషా, శ్రీరామ్‌లను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన చిన్నారావు మెమోరియల్ క్రీడా పోటీల్లో కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాణించారు. వంద మీటర్ల పరుగు పందెంలో దువ్వాడ గిరీషా, షాట్‌పుట్‌లో హనుమంతు శ్రీరామ్ కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు చిన్నంనాయుడు సత్కరించి మెడల్, సర్టిఫికెట్లను అందించారు. పీఈటీలు వై.కుసుమకుమార్, హరనాథ్, తెలుకలగణేష్ పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితే బాధ్యత వహిస్తారా?

● విద్యుత్‌శాఖ ఏఈపై సబ్‌కలెక్టర్ ఆగ్రహం


వినతులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమార్

టెక్కలి: టెక్కలి పట్టణంలో ప్రమాదకరంగా ఉన్న ఐరన్ విద్యుత్ స్తంభాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నప్పటికీ వాటిని తొలగించడం లేదు.. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత వహిస్తారా అన్ని టెక్కలి విద్యుత్ శాఖ ఏఈ ఈశ్వరరావుపై సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ మండిపడ్డారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన విభాగానికి 20 వినతులు అందాయి. ఈ సందర్భంగా పట్టణంలో ప్రమాదకరంగా ఉన్న ఐరన్ విద్యుత్ స్తంభాలు తొలగించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ యు.విశ్వనాథం ఫిర్యాదు చేశారు. మరో 15 రోజుల్లో పనులు ప్రారంభిస్తామని ఏఈ ఈశ్వరరావు బదులిచ్చారు. వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని మున్సబుపేటకు చెందిన బసవల సావిత్రి, తనకు చెందిన ఆవు మరణించడంతో బీమా అందజేయాలని రెయ్యిపేటకు చెందిన పిట్ట ఆదిలక్ష్మి విన్నవించారు. తన ఇంటిని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మెళియాపుట్టి మండలం జాడుపల్లి గ్రామానికి చెందిన ఆనెం అప్పలనర్సమ్మ ఫిర్యాదు చేశారు. స్థానిక రైల్వే స్టేషన్‌కు ఎదురుగా ఉన్న కాలనీలో మురుగు నీరు, చెత్త సమస్యను పరిష్కరించాలని స్థానికులు విన్నవించారు. సచివాలయం, వెల్‌నెస్ కేంద్రాలకు తమ సొంత భూమిని ఇచ్చామని దానికి బదులుగా మరో చోట స్థలాన్ని మంజూరు చేయాలని సంతబొమ్మాళి మండలం నరసాపురం గ్రామానికి చెందిన మోడి అరుణ విన్నవించారు.

అశోక్‌వి అర్థంలేని వ్యాఖ్యలు

● ఎమ్మెల్సీ నర్తు రామారావు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

ఇచ్ఛాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీన నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టడం, యాత్ర విజయవంతం కావడంతో ఇచ్ఛాపురం టీడీపీ ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు భయం పట్టుకుందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. దీంతో యాత్రపై ఆయన అర్థలేని వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మితో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి అశోక్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాతే సంక్షేమం మొదలైందన్నారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. రాష్ట్రంలో గల పేదవాడు వ్యక్తిగత అభివృద్ధి సాధించేలా చేయడమే సంక్షేమమన్నారు. వ్యక్తిగత అభివృద్ధి సమాజాభివృద్ధిలో భాగం కాదా అన్ని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకులు దోచుకో.. దాచుకో.. నినాదంతో రాష్ట్రాన్ని దోచుకున్నారన్నారు. అందుకే ఇప్పుడు ఆ పార్టీ అధినేత జైలు పాలయ్యారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కరోనా వంటి సంక్షోభ సమయంలో కూడా ప్రజలకు సంక్షేమాన్ని వర్తింపజేసి ఆదుకున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన అశోక్ నియోజకవర్గానికి చేసింది శూన్యమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇచ్ఛాపురం నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. సమావేశంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, మున్సపల్ వైస్‌చైర్మన్లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి, పార్టీ పట్టణ అధ్యక్షుడు బి.ప్రకాశపట్నాయక్, జేసీఎస్ కన్వీనర్ సాలిన ఢిల్లి, పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు ఉన్నారు.

మంచినీటి ప్రాజెక్టు నమూనా పరిశీలన


శివాజీనగర్‌లో మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికీ మంచినీరు అందించేందుకు చేపట్టనున్న పనుల్లో భాగంగా ప్రాజెక్టు నమూనాను అధికారులు సోమవారం పరిశీలించారు. మున్సిపాలిటీ 20వ వార్డులో ఉన్నటువంటి శివాజీనగర్, లేబర్‌కాలనీలలో సోమవారం నాయకులు, అధికారులు పర్యటించారు. రూ.100 కోట్లతో జంట పట్టణాల్లో చేపట్టనున్న మంచినీటి ప్రాజెక్టుకు ఇటీవల రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు శంకుస్థాపన చేశారు. సంబంధించిన మ్యాప్‌తో పనులు జరుగు ప్రాంతాలను కాంట్రాక్టర్‌కు చూపించారు. పరిశీలనలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌కుమార్, మున్సిపల్ ఏఈ బీర అవినాష్, ప్రాజెక్టు కాంట్రాక్టర్, సూపర్ వైజర్ రవికుమార్, చిరంజీవి, మోహనరావు, మద్దిల రాజు, ఉమాశంకర్ ఉన్నారు.

వరి పొలాల పరిశీలన


శివాజీనగర్‌లో మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

పలాస: పలాస నియోజకవర్గంలోని మూడు మండలాలను కరువు ప్రాంతంగా ప్రకటించాలని వామపక్ష పార్టీ నాయకులు కోరారుస. ఈ మేరకు ఆయా మండలాల్లోని వరి పంట పొలాలను సోమవారం పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీరు లేక వరి పొలాలు ఎండిపోతున్నాయన్నారు. పొలాలను పరిశీలించిన వారిలో సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకుడు మద్దిల రామారావు, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, సీపీఐ నాయకులు చాపర వెంకటరమణ, చాపర వేణుగోపాల్, ఎం.వినోద్ ఉన్నారు.

'రాయల్ బెంగాల్ టైగర్'తో జాగ్రత్త

కంచిలి: మండల పరిధిలో రాయల్ బెంగాల్ టైగర్ సంచరిస్తుందని అటవీశాఖ, జిల్లా కలెక్టర్ నుంచి సమాచారం వచ్చిందని, దీనిపై ప్రజలంతా చాలా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎస్.హైమావతి కోరారు. దీనిపై మండలంలోని వీఆర్వోలందరూ తమ పరిధిలో ప్రజలను అప్రమత్తంగా చేసేందుకుగాను దండోరా వేయించాలని ఆదేశించారు. ఎవరూ ఒంటరిగా పొలాలకు, తోటలకు వెళ్లవద్దన్నారు. ఎక్కడైనా పులి కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కిరణ్‌చంద్ కారణజన్ముడు


కిరణ్‌చంద్ తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఎంపీపీ దాస్ తదితరులు

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన అవయవ దాత మలిపెద్ది కిరణ్‌చంద్ కారణ జన్ముడని ఎంపీపీ నిమ్మన దాస్ అన్నారు. సోంపేట పట్టణానికి చెందిన మోహన్, కల్యాణి దంపతుల కుమారుడు కిరణ్‌చంద్ కొద్ది నెలల క్రితం బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం కిరణ్‌చంద్ 16వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. అనంతరం కిరణ్‌చంద్ తల్లిదండ్రులను వైద్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ నగిరి ప్రభావతి, గ్రామస్తులు మల్లా వెంకటరమణ, తిరుపతి, జెమ్స్ ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

సోంపేట రోటరీ క్లబ్‌కు డైమండ్ అవార్డు


అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు, ప్రతినిధులు

సోంపేట: సోంపేట రోటరీ క్లబ్‌కు డైమండ్ అవార్డు వచ్చింది. విశాఖలో ఆదివారం జరిగిన డిస్ట్రిక్ రోటరీ ఫౌండేషన్ సెమినార్లో అవార్డును అందుకున్నట్లు క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. రోటరీ సేవలను గుర్తించి రోటరీ ఇంటర్నేషనల్ ట్రస్టు హౌస్ చైర్మన్ భరత్ పాండ్యా అవార్డును అందజేశారన్నారు. అవార్డుతో రోటరీపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. అవార్డు కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి పి.వి.కృష్ణారావు, 25 మంది ప్రతినిధులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

సమగ్ర భూసర్వేతో ప్రయోజనం


ఈపాస్ పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

కవిటి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సమగ్ర భూసర్వేతో అనుభవంలో ఉండి రికార్డుల్లో చోటు దక్కని రైతులకు ఈ కార్యక్రమం ద్వారా భూముల ఆధునీకరణ జరగడం ఎంతో ప్రయోజనకరమని మండల సర్వేయర్ మల్లికార్జున పాణిగ్రాహి అన్నారు. ఆర్‌ఖైరిపురం రెవెన్యూలో ఇటీవల 1018 ఎకరాల విస్తీర్ణానికి సమగ్ర భూసర్వే సోమవారం నిర్వహించారు. ఇందుకు సంబంధించి 489 ఖాతాలను గుర్తించినట్టు చెప్పారు. ఇందుకు సంబంధించి ఎలక్ట్రానిక్ పట్టాదార్ పాస్‌పుస్తకాల్ని ప్రభుత్వం ఎఫ్ఎంబీస్కెచ్, సర్వేనంబర్ తదితర వివరాల్ని నమోదుచేసి రైతులకు పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వై.నీలయ్య, పుల్లట జగదీష్, పిరియా వైకుంఠరావు, పిరియా ఆనందరావు, వై.సత్యం, పుల్లట రాంప్రసాద్, బి.కీర్తిరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సహస్ర దీపారాధన


సహస్ర దీపారాధన

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి రత్తకన్న గ్రామంలో గడచిన పౌర్ణమి నుంచి ప్రారంభమైన గజలక్ష్మి నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం మహిళలంతా సహస్ర దీపారాధన కార్యక్రమం నిర్వహించారు.

ఢిల్లీ చేరిన పలాస మట్టి


మట్టి కలశాలతో ఢిల్లీలో పలాస ప్రతినిధులు

కాశీబుగ్గ: నాదేశం-నా మట్టి కార్యక్రమంలో భాగంగా పలాస నియోజకవర్గంలో సేకరించిన మట్టి దేశరాజధాని ఢిల్లీకి చేరింది. ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్‌లు ఇక్కడ సేకరించిన మట్టిని మట్టి కలశాలలో భద్రపరిచి తీసుకొని వెళ్లారు. దీన్ని పార్లమెంట్ భవనం ఎదురుగా ఏర్పాటు చేసిన పెద్దకుండలో సోమవారం వేశారు. పలాస ఎంపీడీవో రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో టెక్కలిపట్నం పంచాయతీ ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ మద్దు రంగారావు, మందస మండలం నుంచి పితాతోలి పంచాయతీ సర్పంచ్ చింతాడ చలపతిరావు, సోమేష్ తదితరులు ఢిల్లీ వెళ్లారు.

కరువు మండలంగా ప్రకటించాలని వినతి


అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు

మందస: మందస మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని మహేంద్ర, చైతన్య రైతు సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మందసలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ బడే పాపారావు, వ్యవసాయాధికారి జి.నాగరాజులకు వినతిపత్రాన్ని అందజేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. బోర్లు, ఇంజన్లతో రైతులు పంటలకు నీరు అందిస్తున్నప్పటికీ, ఆయా ప్రయత్నాలు ఫలించడంలేదన్నారు. రుణాలను మాఫీ చేయాలని, రబీ సీజన్‌లో అపరాలు, వేరుశనగ, సన్‌ఫ్లవర్, నువ్వులు తదితర విత్తనాలు ఉచితంగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు బెస్త కామేశ్వరరావు, మామిడి మాధవరావు, కొర్ల హేమారావుచౌదరి, యు.సోమనాథం, కె.మోహనరావు, వజ్జ తులసీదాసు, డి.వీరాస్వామి, జి.సత్యన్నారాయణ ఉన్నారు.

ఉద్యోగులు ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి

● మున్సిపల్ సమావేశంలో సభ్యులు


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ, సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ప్రజలతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని కౌన్సిల్ సభ్యులు కోరారు. పురపాలకసంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యతన సోమవారం మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తొమ్మిది అంశాలపై సభ్యులు చర్చించి.. ఆమోదించారు. అనంతరం చైర్‌పర్సన్ రాజలక్ష్మి మాట్లాడుతూ.. ఇంటిపన్ను, కుళాయి పన్నుల వసూల కోసం వెళ్తున్న ఉద్యోగులు ప్రజలతో అమర్యాదగా మాట్లాడుతూ వెంటనే చెల్లించాలని వేధిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పన్నులు చెల్లించినప్పటికీ మళ్లీ కట్టాలని డిమాండ్ చేస్తున్నారని, కుళాయి కనెక్షన్లు లేని వారికి కూడా పన్నులు ఎందుకు వేస్తున్నారని కౌన్సిల్ సభ్యులు ప్రశ్నించారు. సాంకేతిక కారణాలతో గతంలో పన్నులు చెల్లించినప్పటికీ మళ్లీ పన్నులు కట్టాలని నోటీసులు వచ్చాయని.. అటువంటి వాటిని సరిచేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్ తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్, మున్సిపల్ వైస్‌చైర్మన్లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి, కోఆప్షన్‌సభ్యులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమంతోనే అభివృద్ధి సాధ్యం

● వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి
● పట్టుపురంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


పట్టుపురంలో సంక్షేమాన్ని వివరిస్తున్న దువ్వాడ వాణి

కోటబొమ్మాళి: పేదల సంక్షేమంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలను అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి కృషిచేస్తున్నారని చెప్పారు. నీలంపేట సచివాలయం పరిధిలోని పట్టుపురం, మణినాగేశ్వరపురం గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించి బ్రోచర్లను అందజేశారు. గత టీడీపీ ప్రభుత్వం సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను మంజూరు చేస్తోందన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, పార్టీ మండల కన్వీనర్ నూక సత్యరాజ్, మాజీ ఎంపీపీ ఎస్.రాఘవరావు, దువ్వాడ హైంధవి, సర్పంచ్ పట్నాన శివ, నాయకులు మెట్టు వాసు, దాసరి శిమ్మయ్య, మెట్ట ఈశ్వరమ్మ, రెడ్డి లక్ష్మణ, బొడ్డు వెంకటరమణ, సుంకరి జనార్దనరావు, గూట్ల లక్ష్మణరావు, గురువెల్లి కేశవరావు, సనపల కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యులు బొడ్డు చెంచులు, అప్పన్న, జేసీఎస్ మండల ఇన్‌చార్జి గెడ్డవలస నాగభూషణరావు, సోషల్‌మీడియా కన్వీనరు సింగూరు నారాయణరావు, జేసీఎస్ కన్వీనర్లు రాంపాత్రుని శివారెడ్డి, అక్కురాడ సురేష్ ఉన్నారు.

నేడు పలాస మండల సమావేశం

పలాస: స్థానిక మండలాభివృద్ధి కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో ఎస్.రమేష్‌నాయుడు సోమవారం తెలిపారు. ఎంపీప ఉంగ ప్రవీణ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.